క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొరిటిపాడు(గుంటూరు): విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా బుధవారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ ఎస్.గురవయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ ఉండదని చెప్పారు. 11 కేవీ ఈపీఎఫ్ ఆఫీస్ ఫీడర్ మెయింటనెన్స్, చెట్లు తొలగింపులో భాగంగా డీ–8 సెక్షన్ పరిధిలోని కృష్ణనగర్, 1 నుంచి 3వ లైన్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఆయుర్వేద వైద్యులు హరిప్రసాద్ చిరస్మరణీయులు

లక్ష్మీపురం: ప్రముఖ ఆయుర్వేద వైద్యులు దివి హరిప్రసాద్ చిరస్మరణీయులని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ ఆరోగ్య సభ బృందం ఆధ్వర్యంలో డాక్టర్ దివి హరిప్రసాద్ సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ సీనియర్ సభ్యులు జైహింద్ గురూజీ, జె.రాఘవరావు, జోస్ఫిన్, వి.సత్యానారాయణ, డాక్టర్ హరిప్రసాద్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు



లక్ష్మీపురం: స్థానిక సంపత్ నగర్ రామాలయం పాలక మండలి అధ్యక్షుడు జె. నరసింహారావు, కార్యదర్శి జెట్టి మురళి ఆధ్వర్యంలో కార్తిక మాసం మంగళవారం ఏకాదశి సందర్భంగా ఉదయం ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. సాయంతరం నూట తొంబై మంది దంపతులతో ఆలయ ప్రధానార్చకులు సాయి ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పూజానంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమాలను గౌరవ అధ్యక్షుడు చెన్నూరు మహేష్ పర్యవేక్షించారు.

సర్వైకల్ క్యాన్సర్ నివారణపై అవగాహన



గుంటూరు ఎడ్యుకేషన్: సర్వైకల్ క్యాన్సర్ నివారణపై సరైన అవగాహన అవసరమని ఓమేగా హస్పిటల్స్‌కు చెందిన డాక్టర్ పి.గీతారుక్మిణి పేర్కొన్నారు. లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా కళాశాలలో మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ ఆదర్శ్, ఓమేగా హాస్పిటల్స్ సంయుక్తంగా సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య వక్తగా పాల్గొన్న డాక్టర్ గీతా రుక్మిణి మాట్లాడుతూ 14 నుంచి 25 ఏళ్ల లోగా వయసు ఉన్న విద్యార్థినులకు వాక్సినేషన్ వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. వ్యాధి సంక్రమించిన తరువాత వైద్యం కన్నా ముందస్తు అప్రమత్తతో నియంత్రణ అనేది ప్రధానమని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బి.రోహిణిదేవి, రోటరీ క్లబ్ ఆఫ్ ఆదర్శ్ ప్రతినిధులు కె.హిమబిందు, డాక్టర్ కె.పద్మజ, జి.భారతి, ఎం.అనూరాధ, మాధవీలత, రాణి పాల్గొన్నారు.

వర్క్ ఇన్‌స్పెక్టర్లే కాంట్రాక్టర్లు

- ఏఈలను శాసిస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లు, లీకు వర్కర్లు
- ట్యాప్ కనెక్షన్ ఇవ్వాలంటే రూ.12 నుంచి 15 వేలు డిమాండ్
- అనధికారికంగా ట్యాప్ కనెక్షన్ ఇవ్వాలంటే రూ.20 నుంచి 50 వేలు
- వీరికి అంతర్గత బదిలీలకు అవకాశం లేదు



హౌసింగ్‌బోర్డులో నిర్మాణంలో ఉన్న ఇంటికి మున్సిపల్ ట్యాప్ కనెక్షన్ ఇచ్చిన దృశ్యం

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థలో అంతా వర్క్ ఇన్‌స్పెక్టర్లు, లీకు వర్కర్ కమ్ ఫిట్టర్ హవా కొనసాగుతోంది. ఆయా డివిజన్లలో ఏ పని చేయాలన్నా వర్క్ ఇన్‌స్పెక్టర్లు, లీకు వర్కర్లే దగ్గరుండి చూసుకోవడం.. అవసరమైతే తామే కాంట్రాక్ట్ అవతారమెత్తి పనులు చక్కబెడుతుంటారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏళ్ల తరబడి ఒకే ప్రాంతంలో విధులు నిర్వహించడంతో వారికి అవినీతికి అడ్డూఅదుపు లేకుండా పోయింది.

ఏఈలను కూడా శాసిస్తున్న వైనం

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఇటీవల ఏఈల అంతర్గత బదిలీలు జరిగాయి. అయితే సదరు ప్రాంతంలో ఏఈలకు అన్ని తామే అయి వ్యవహరిస్తుంటారని ఆరోపణలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో ఏఈలను కూడా శాసించే స్థాయికి వర్క్ ఇన్‌స్పెక్టర్లు, లీకు వర్కర్లు వెళ్లారు. ఆయా డివిజన్లలో వర్క్ ఇన్‌స్పెక్టర్లే కాంట్రాక్టర్లుగా వ్యవహరించడంతో... వేరే వారిని టెండర్ కూడా వేయనియకుండా చూడటంలో సిద్ధహస్తులే. అవసరమైతే తామే కాంట్రాక్టర్లకు పెట్టుబడి పెట్టి పనులు చేయిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

సుమారు రూ.16లక్షల బిల్లులు పెండింగ్..

గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఓ రిజర్వాయర్‌లో పనిచేసే ఓ లీకు వర్కర్ తానే కాంట్రాక్ట్ అవతారమెత్తి పైపులైన్ పనులు, సిల్ట్ వర్క్ పనులు చేశాడు. అయితే దీనికి సంబంధించి సుమారు రూ.16 లక్షలు పెండింగ్ ఉందంటే సదరు లీకు వర్కర్ ఆదాయం ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎల్‌బీనగర్, బీఆర్ స్టేడియంలో, ఎల్ఎల్ఆర్, సర్కిల్ ఆఫీస్, ఏటీ అగ్రహారం తదితర ప్రాంతాల్లో వర్క్ ఇన్‌స్పెక్టర్లే కాంట్రాక్టర్లుగా అవతారమెత్తి నామినేషన్ పద్ధతిలో కొంచెం పనికి కూడా పెద్ద పని చూపి అధికంగా బిల్లులు పెట్టుకుని డ్రా చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఏటీ అగ్రహారం, రెడ్డి పాలెం, ఇతర పలు ప్రాంతాల్లో అనధికారికంగా వాటర్ ట్యాపులు ఇచ్చి రూ.30 నుంచి 50 వేలు దాకా వసూలు చేస్తున్నట్లు సమాచారం. పశ్చిమ నియోజకవర్గంలో ఫిట్టర్ నుంచి ఫిల్టర్ బెడ్ ఆపరేటర్‌గా పదోన్నతి పొందిన ఓ ఉద్యోగి తిరిగి ఫిట్టర్‌కే డిమోషన్ తీసుకుని మరి ఫిట్టర్ విధులు నిర్వహిస్తున్నాడంటే విషయం అర్థం చేసుకోవచ్చు.

బదిలీలు లేకపోవడంతో...

వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, లీకు వర్కర్లకు అంతర్గత బదిలీలు లేకపోవడంతో ఆడిందే పాట..పాడిందే పాటగా మారింది. ఒక ఇంటికి ట్యాప్ కనెక్షన్ ఇవ్వాలంటే దానికి సరిపడ అన్ని చలానాలు నగరపాలక సంస్థకు చెల్లించినా ట్యాప్ కనెక్షన్ ఇవ్వాలంటే రూ.12 నుంచి 15 వేలు దాకా తీసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. నిర్మాణంలో ఉన్న ఇంటికి ట్యాప్ కనెక్షన్ ఇవ్వకూడదు... కాని వీరు అడ్డగోలుగా నిర్మాణంలో ఉన్న ఇంటికి కూడా ట్యాప్ కనెక్షన్లు ఇచ్చేస్తున్నారు. ఇప్పటికైన నగరపాలక సంస్థ కమిషనర్ స్పందించి వర్క్ ఇన్‌స్పెక్టర్లు, లీకు వర్కర్లు దందాను అరికట్టి.. అంతర్గత బదిలీలు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ వీరేంద్రబాబు

లక్ష్మీపురం: తల్లిదండ్రులు తమ పిల్లలపై శ్రద్ధ ఉంచాలని పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు తెలిపారు. స్థానిక పట్టాపురం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం గంజాయి అలవాటు పడిన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సోమవారం గంజాయి విక్రయించే వారిని గంజాయి వినియోగించే వారిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆయన మాట్లాడుతూ ఈ కేసులో గంజాయి తాగిన విద్యార్థులు 18 మందికి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించడం జరిగిందని తెలిపారు. మంగళవారం పట్టాభిపురం పోలీసు స్టేషన్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. సీఐ వీరేంద్రబాబు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు, బయట ఎవరితో తిరుగుతున్నారు? ఎలాంటి స్నేహాలు చేస్తున్నారు, ఎలాంటి చెడు అలవాట్లకు బానిసలు అవుతున్నారు కూడా గమనించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. విద్యార్థులు చెడు స్నేహాలు, గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలై వారి భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో పట్టాపురం పోలీస్ స్టేషన్ ఎస్ఐ నరహరి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించే ఖురాన్ కంఠస్థ పోటీలు



ఖురాన్ కంఠస్థ పోటీల్లో ఎండీ మున్ను

గుంటూరు ఎడ్యుకేషన్: ఆధ్యాత్మిక విద్య చిన్నతనం నుంచే అలవర్చుకోవడం ద్వారా విద్యార్థులు సమాజంలో ఉత్తములుగా రాణించవచ్చని జైన్ హైస్కూల్ డైరెక్టర్ డాక్టర్ మొహమ్మద్ మున్ను అన్నారు. మంగళవారం సంగడిగుంటలోని పాఠశాలలో యునైటెడ్ ఫోరం ఫర్ ఖురాన్ స్టడీస్ ఆధ్వర్యంలో ఖురాన్ కంఠస్థ ప్రతిభా పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా మున్ను మాట్లాడుతూ ఖురాన్ గ్రంథంలోని అంశాలను ఆచరణలో తీసుకోవడం ద్వారా పుణ్యాన్ని సంపాదించుకోవచ్చునని అన్నారు. తద్వారా ఇహ, పరలోకాలను ఆనందమయం చేసుకోవచ్చునన్నారు. ఆధ్యాత్మికతను ప్రతి ఒక్కరూ కలిగి ఉండడం వల్ల శాంతి సౌభ్రాతృత్వం, దయ కరుణ వంటి అంశాలు చిన్నతనం నుంచే అలవడతాయని తెలిపారు. కార్యక్రమంలో యునైటెడ్ ఫోరం ఫర్ ఖురాన్ స్టడీస్ నిర్వాహకులు, మొహమ్మద్ జహీర్, బాజీద్ పాల్గొన్నారు.

అపార్‌ని వేగంగా పూర్తి చేయాలి

నెహ్రూ నగర్: నగరంలోని విద్యా సంస్థల్లో ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్) వేగంగా పూర్తి చేయాలని, ప్రధానంగా ఇంటర్మీడియెట్ విద్యా సంస్థలు అపార్ రిజిస్ట్రేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆర్ఐఓ, ఎంఈఓలు, గుంటూరు నగరంలోని ప్రైవేట్ ఇంటర్మీడియెట్ విద్యా సంస్థల ప్రతినిధులతో అపార్ రిజిస్ట్రేషన్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

చిన్నారుల్లో సృజనాత్మకత వెలికితీతకు కృషి

ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: చిన్నారుల్లో సృజనాత్మక నైపుణ్యాలు వెలికితీయడంలో బాలానంద కేంద్రాలు విశేషంగా కృషి చేస్తున్నాయని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని బాలానంద కేంద్రం ఆధ్వర్యంలో రుద్ర కళాక్షేత్రం సహకారంతో నిర్వహించిన 'రాష్ట్రస్థాయి బాల కళా ప్రభ సాంస్కృతిక కళా సంబరాలు–2024' మంగళవారం ముగిశాయి. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మణరావు మాట్లాడుతూ భారతీయ గ్రామీణ సంస్కృతిలో పాశ్చాత్య ఆధారిత విద్య కంటే కళలు, క్రీడలు, సాంస్కృతిక అంశాల్లో మట్టిలో మాణిక్యాలుగా ఖండంతర ఖ్యాతిని ఆర్జించిన వారు ఉన్నారని పేర్కొన్నారు. లలిత సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్వాహకురాలు డాక్టర్ పి.విజయ మాట్లాడుతూ దశాబ్దాలుగా బాలానంద కేంద్రం చదువుతోపాటు విద్యార్థుల సమగ్ర వికాసానికి దోహదపడటం, తమ పెద్ద కుమారుడు బాలానంద కేంద్రం విద్యార్థిగా ఉన్నప్పుడే తన జీవిత లక్ష్యాలకు పునాదులు వేసుకున్నాడని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన బాలానంద కేంద్రం అధ్యక్షుడు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ 1955 లో బాలానంద కేంద్ర స్థాపన మొదలు ఇప్పటి వరకు భావి భారత పౌరులను తీర్చిదిద్దే అదృష్టం తమలాంటి వారికి కలగటం పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైల్వే సీనియర్ డివిజనల్ ఇంజినీర్, ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి జవ్వాది అనూష, కార్యదర్శి నడింపల్లి గురుదత్, బాలానంద కేంద్రం సాంస్కృతిక విభాగం కోఆర్డినేటర్ మాచిరాజు రాజేష్ పాల్గొన్నారు.

ఘనంగా మహా రుద్రాభిషేకం



గుంటూరు ఎడ్యుకేషన్: మల్లికార్జునపేటలోని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం వద్ద మంగళవారం సాయంత్రం నిర్వహించిన మహా రుద్రాభిషేకం భక్తులను భక్తి తన్మయత్వంలో ముంచెత్తింది. అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులతో లోక కళ్యాణార్థం మృతిక(మట్టి) శివ లింగానికి విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. ఈసందర్భంగా వందలాదిగా భక్తులు మహా రుద్రాభిషేకాన్ని తిలకించారు. అనంతరం దేవస్థాన ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మాలధారులతో పాటు భక్తులకు ప్రసాద వితరణ గావించారు.

బాలికను తల్లిదండ్రులకు అప్పగింత



బాలికను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

లక్ష్మీపురం: పాత బస్టాండ్ సమీపంలోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వద్ద అదృశ్యమైన బాలికను లాలాపేట పోలీసులు సోమవారం నైట్ బిట్ సిబ్బందికి దొరకడంతో మంగళవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలు.. ఈనెల 9వ తేదిన సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వద్ద తండ్రి రాజేష్, తల్లి పద్మ 4 సంవత్సరాల బాలికను తీసుకొచ్చారు. బాలికను షాపింగ్ మాల్ మెట్ల పైన కూర్చోబెట్టి టిఫిన్ చేసేందుకు వెళ్లారు. తిరిగి వచ్చి చూసే సరికి బాలిక అదృశ్యమైంది. దీంతో రెండు రోజుల పాటు చుట్టు పక్కల పరిసర ప్రాంతాలలో వెతుకలాడి ఎంతకు కనిపించక పోవడంతో సోమవారం లాలాపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ శివప్రసాద్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలించారు. లాలాపేట ఎస్‌బీఐ బ్రాంచ్ వద్ద బాలికను గుర్తించారు. మంగళవారం సాయంత్ర బాలిక కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిపించి బాలికను అప్పజెప్పారు.

వీల్‌చైర్లు వితరణ



గుంటూరు మెడికల్: రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పి.రామచంద్రరాజు మంగళవారం గోరంట్ల ప్రభుత్వ ఛాతి, సాంక్రమిత వ్యాధుల హాస్పిటల్‌కు మూడు వీల్‌చైర్లు అందజేశారు. వ్యాధి బాధితులకు వినియోగించేందుకు వీల్‌చైర్లు బహూకరించిన రెడ్‌క్రాస్ నిర్వాహకులకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకంటి రఘు కృతజ్ఞతలు తెలిపారు.

నగరంలో స్థానిక సమస్యలపై దృష్టి సారించాలి

సచివాలయ కార్యదర్శులకు కమిషనర్ శ్రీనివాసులు ఆదేశం



సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో వార్డు సచివాలయ కార్యదర్శులు స్థానికంగా ఉండే ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. మంగళవారం రత్నగిరి నగర్, తురకపాలెం రోడ్, నగరాలులోని సరస్వతీ నగర్ తదితర ప్రాంతాల్లో స్థానికుల ఫిర్యాదు మేరకు నగరపాలక సంస్థ అధికారులతో కలసి మంగళవారం పరిశీలించారు. తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నూతన రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రజల నుంచి అందే ఫిర్యాదులు లేదా అర్జీలను నేరుగా క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తామని చెప్పారు. వార్డు సచివాలయాల వారీగా స్థానిక సమస్యల పరిష్కారానికి ఆయా కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్యం, నీటి సరఫరా, పైప్‌లైన్ మైనర్ లీకులు, ఇంటి పన్నులు, రహదారుల ఆక్రమణలు, వీధి దీపాలు వంటి సమస్యలను సచివాలయం పరిధిలోనే పరిష్కారానికి కృషి చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రత్నగిరినగర్‌లో పర్యటించి, తాగునీరు సక్రమంగా రావడంలేదన్న స్థానికుల ఫిర్యాదు మేరకు పెద్ద పలకలూరు రోడ్‌లో అదనంగా బోర్‌లు ఏర్పాటు చేసి, నీటిని అందించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను, ఖాళీ స్థలాలో పెరిగిన మొక్కలను తొలగించుకోవాలని స్థల యజమానులకు నోటీసులు ఇవ్వాలని శానిటేషన్ కార్యదర్శులను ఆదేశించారు. ప్యాచ్ వర్క్‌లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. తురకపాలెం రోడ్‌లో పర్యటించి, స్థానిక వార్డు సచివాలయంలో నూతన ట్యాప్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, డీఈఈలు రమేష్ బాబు, శ్రీనివాస్, డీసీపీ సూరజ్ కుమార్, ఏఎంహెచ్ఓ ఆనందకుమార్ పాల్గొన్నారు.

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో

గుంటూరు నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దుకోవడంలో కళ్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్ నిర్వాహకుల పాత్ర కీలకమని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగరపాలక సంస్థ అధికారులు, ట్రాఫిక్ పోలీసు అధికారులు, కళ్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్, ఫంక్షన్ హాల్స్ ఉన్న హోటల్స్ యజమానులతో వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, ట్రాఫిక్ సీఐలు అశోక్ కుమార్, సింగయ్య పాల్గొన్నారు.

అపార్‌ని వేగంగా పూర్తి చేయాలి

నగరంలోని విద్యా సంస్థల్లో ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్) వేగంగా పూర్తి చేయాలని, ప్రధానంగా ఇంటర్మీడియెట్ విద్యా సంస్థలు అపార్ రిజిస్ట్రేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆర్ఐఓ, ఎంఈఓలు, గుంటూరు నగరంలోని ప్రైవేట్ ఇంటర్మీడియెట్ విద్యా సంస్థల ప్రతినిధులతో అపార్ రిజిస్ట్రేషన్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

జీఎస్టీలో ట్యాక్స్ కన్సల్టెంట్ల పాత్రే కీలకం

జీఎస్టీ జాయింట్ కమిషనర్ లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): జీఎస్టీలో ట్యాక్స్ కన్సల్టెంట్ల పాత్రే కీలకమని సెంట్రల్ జీఎస్టీ జాయింట్ కమిషనర్ బి.లక్ష్మీనారాయణ చెప్పారు. స్థానిక కన్నావారితోటలో మంగళవారం 'ఈజీ టాక్స్' పేరుతో కొత్తగా ప్రారంభించిన టాక్స్ కన్సల్టెన్సీ సర్వీస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. జీఎస్టీ రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్, ఈజీ టాక్స్ నిర్వాహకుడు చుక్కా విల్సన్ బాబు అధ్యక్షత వహించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. జీఎస్టీ చెల్లింపుదారులు తెలిసీతెలియక ఎన్నో తప్పులు చేస్తున్నారని, వాటిని సరిదిద్దటానికి ట్యాక్స్ కన్సల్టెంట్లు ఎంతో అవసరమన్నారు. పన్ను చట్టాల నిబంధనలు తరచూ మార్పులకు లోబడి ఉటాయని పేర్కొన్నారు. అర్థం చేసుకుని అప్‌డేట్ చేయడం కన్సల్టెంట్లకే సాధ్యమన్నారు. జీఎస్టీ డెప్యూటీ కమిషనర్ వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ చేసిన నిష్ణాతులైన అధికారులు ఇలాంటి సంస్థ నెలకొల్పడం అభినందనీయమన్నారు. జీఎస్టీ నిఘా విభాగం అసిస్టెంట్ కమిషనర్లు ఎం.నాగరాజు, రవికుమార్ మాట్లాడుతూ.. టాక్స్ కన్సల్టెంట్లతో సమాజంలో అవగాహన పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇంకా విశ్రాంత జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్లు రాజేశ్వరరావు, వివేకానంద, క్రెడాయ్ ఏపీ చైర్మన్ ఆళ్ళ శివారెడ్డి, ఈజీ టాక్స్ వ్యవస్థాపకుడు చుక్కా విల్సన్ బాబు తదితరులు మాట్లాడారు.

డిసెంబర్ ఒకటి నుంచి ఇంటింటి చెత్త సేకరణ

నెహ్రూనగర్: నగరంలో డిసెంబర్ ఒకటి నుంచి నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ జరిగేలా ప్రజారోగ్య విభాగ కార్యచరణ ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. స్థానిక కౌన్సిల్ హాల్‌లో ప్రజారోగ్య విభాగ శానిటరీ సూపర్వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, ప్రత్యేక పర్యవేక్షణ అధికారులతో నగరంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణపై సమీక్ష మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజల ఆరోగ్య రక్షణలో పారిశుద్ధ్య విభాగం కీలకమన్నారు. అటువంటి ప్రజారోగ్య విభాగంలో ప్రతిఒక్కరూ అంకిత భావంతో పని చేయాలని చెప్పారు.

రాష్ట్ర స్థాయి కర్రసాములో ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర స్థాయి కర్రసాము పోటీల్లో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపినట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో మంగళవారం జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో విష్ణువర్ధన్ మాట్లాడుతూ నేషనల్ ట్రెడిషనల్ సిలంబం చాంపియన్ షిప్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన కర్రసాము పోటీల్లో 8వ, 9వ తరగతి విద్యార్థులు సుధారాణి, డెన్నీస్ రాజ్, మణికంఠ, రిషీ కార్తీక్, కౌశిక్ కృష్ణ, ఓంకారేశ్వర్ రెడ్డి, చరణ్ కార్తీక్, ఆరాధ్య, పార్థు, శివ పరుశురామ సబ్ జూనియర్ 40–45 కేజీ బాడీ వెయిట్ విభాగం రాష్ట్ర స్థాయిలో విజయ కేతనం ఎగుర వేశారని తెలిపారు. శారీరక, మానసిక ధారుఢ్యాన్ని పెంపొందించే ప్రాచీన యుద్ధ కళ ఆయిన కర్రసాము నైపుణ్యంలో తమ పాఠశాలలో అత్యుత్తమమైన శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, సీనియర్ కోఆర్డినేటర్ దుర్గాశ్యామ్, సిలంబం శిక్షకుడు రామకృష్ణ పాల్గొన్నారు.

హోప్ విన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించాలన్న లక్ష్యంతోనే ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు హోప్ విన్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ షమ సుల్తానా పేర్కొన్నారు. ప్రతి నెల క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలలో భాగంగా తాడికొండ మండలం పొన్నెకల్లులో ఉన్న లూథరన్ చర్చిలో మంగళవారం హోప్ విన్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హాస్పటల్ చైర్మన్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సుమారు 200 మంది రోగులను పరీక్షించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈసందర్భంగా డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య భద్రతకు తమ హాస్పిటల్స్ నిరంతరం ఉచిత వైద్య శిబిరాలు కొనసాగిస్తుందన్నారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేదలకు ఏదో ఒక రూపంలో సహాయం చేయాలన్న ఉద్దేశంతో గుంటూరు కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డు, గుంటూరువారితోట 7వ లైన్‌లోని తమ హాస్పిటల్‌లో కేవలం రూ.10లకే ఓపీ సౌకర్యం అందుబాటులోకి తెచ్చామన్నారు.

ఏఎన్ఎంల సమస్యలపై హంస వినతి



గుంటూరు మెడికల్: ఏఎన్ఎంల సమస్యలపై గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ హెల్త్ అండ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీ హంస) జిల్లా అధ్యక్షుడు బి.నాగవర్ధన్ ఆధ్వర్యంలో మంగళవారం సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఏఎన్ఎం గ్రేడ్–3 ఉద్యోగులకు వారి జాబ్ చార్టుకి సంబంధం లేని విధులు కేటాయించి వారి అసలు విధులకు ఆటంకం కలిగేలా చేస్తున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఏఎన్ఎంలకు సంబంధం లేని సర్వేకు మినహాయించాలని కోరారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు ఇచ్చిన ఉత్తర్వులను డీఎంహెచ్ఓకు చూపించి ఉత్తర్వుల ప్రకారం ఏఎన్ఎంలకు విధులు కేటాయించాలని కోరారు.